మొక్కలు నాటి.. సంరక్షించాలి..

- హరితహారంలో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణం
- సీఎం కేసీఆర్ మానసపుత్రిక హరితహారం విజయవంతానికి అందరి కృషి భేష్
- కలెక్టరేట్ హరితోత్సవంలో మంత్రి సీహెచ్ మల్లారెడ్డి
- మొక్కలు నాటిన మంత్రి, జెడ్పీ చైర్మన్, కలెక్టర్ తదితరులు



కలెక్టరేట్‌లో మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్ కలెక్టర్ అమయ్‌కుమార్



మల్కారం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ తర్వాత సీఎం కేసీఆర్ హరితహారంపై ప్రత్యేక దృష్టి సారించి భావితరాలకు ఆహ్లాదకరమైన మంచి వాతావరణం అందించాలనే సదుద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపు, దూరదృష్టి వల్ల పట్టణ ప్రాంతాల్లో సైతం పచ్చని అందమైన ఆహ్లాదకరమైన వాతావరణం కనిపిస్తోందన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన హరితోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్, అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్, జిల్లా అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రాబోయే తరాలకు మంచి వాతావరణం, పచ్చని చెట్లను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి మానసపుత్రిక హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కలను నాటడమే కాదు.. వాటిని సంరక్షించే బాధ్యతను కూడా భుజస్కందాలపై వేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి అలాగే వదిలేయవద్దన్నారు. హరితహారంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, రాష్ట్రంలో మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా మొదటి స్థానంలో నిలవడం ఎంతో ఆనందకరం, గర్వంగా ఉందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఏ కార్యక్రమం తలపెట్టినా విజయవంతం కావడంతో పాటు రాబోయే తరాలకు ఉపయోగపడే విధంగా ఉంటుందన్నారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. జెడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లుగా భావించి ఆకుపచ్చని తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా తెలంగాణ హరితహారం కార్యక్రమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టారని జిల్లా పరిషత్ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. నాటి నుంచి కోట్లాది మొక్కలు నాటి సంరక్షించడం వల్లనే పచ్చదనం పెరిగిందన్నారు. హరితోత్సవంలో మొక్కలు నాటడం ఎంతో ఆనందంగా ఉందని శరత్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. జిల్లాలో అనుకున్న లక్ష్యాన్ని సాధించిన అధికారులందరినీ ఆయన అభినందించారు.

మొక్కలు నాటి పచ్చదనం పెంచండి: కలెక్టర్ అమయ్ కుమార్

తెలంగాణ హరితోత్సవంలో జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, విద్యార్థులు మొక్కలు నాటడం ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతి వనం, బృహత్ పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసి పచ్చదనం పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు లక్షలాది మొక్కలు నాటి భావితరాలకు అందివ్వాలన్నారు. హరితహారంలో మేడ్చల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, చైర్మన్లు కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, పావని, ఎంపీపీ ఏనుగు నర్సింహారెడ్డి, ఓడీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్‌ఓ లింగ్యానాయక్, ఆర్డీవో రవి, డీఎఫ్‌ఓ జానకీరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి మొక్కనూ కాపాడుదాం

జవహర్‌నగర్: ప్రతి మొక్కనూ కాపాడి హరిత జవహర్‌నగర్‌గా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. మల్కారం ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రతి ఏడాది లక్షల సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుతున్నామని, ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను అందిస్తామన్నారు. కాలుష్యరహిత జవహర్‌నగర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లు రాజ్‌కుమార్, జిట్ట శ్రీవాణి, కుతాడి శ్రీకాంత్, కోఆప్షన్ సభ్యురాలు శోభారెడ్డి, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా రవాణా కార్యాలయంలో మొక్కలు నాటుతున్న డీటీఓ కిషన్



ఘట్‌కేసర్‌లో మొక్కలు నాటుతున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు



నాగారంలో మొక్కలను నాటుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు



మేడ్చల్‌లో మొక్కలు నాటుతున్న ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్



పూడూర్‌లో ఎంపీపీ రజిత, ఎస్ఐ మురళీధర్, సర్పంచ్ బాబుయాదవ్



దేవరయాంజాల్‌లో మొక్కలు నాటుతున్న రాష్ట్ర బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్

క్లుప్తంగా...

ఉచిత వైద్య శిబిరం



యాద్గార్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ పుట్టరాజు

కీసర: యాద్గార్‌పల్లి గ్రామంలో సోమవారం సన్‌సీడ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి స్పందన లభించింది. సుమారు 200 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పుట్టరాజు ముదిరాజ్, ఉపసర్పంచ్ మల్లేష్, వార్డుసభ్యులు, వైద్యులు అన్వేష్, భాను, పీఆర్‌ఓ రవి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులకు సీపీ అభినందనలు

మేడ్చల్‌రూరల్: గంజాయి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన మేడ్చల్ ట్రాఫిక్ సిబ్బందిని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అభినందించారు. సోమవారం సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా 150 కేజీల గంజాయి తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసిన మేడ్చల్ ట్రాఫిక్ ఎస్ఐ భూపాల్, ఏఎస్ఐ సచ్చిదానందం, కానిస్టేబుల్ శివానందం, ఫహీముద్దీన్‌ను సీపీ స్టీఫెన్ రవీంద్ర ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్, మేడ్చల్ సీఐ నర్సింహారెడ్డితో కలిసి అభినందించారు.

అభినందనలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో సోమవారం ఉత్తమ ఉద్యోగుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మే నెలలో ఈపీకే, కేఎంపీఎల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన కండక్టర్, డ్రైవర్లకు డిపో మేనేజర్ సుధాకర్ చెక్కులను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రామారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌ను కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. ప్రతి ఏడాది రోజమ్మ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. టోర్నీలో కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పీడీ రత్నకుమార్, డైరెక్టర్ సరోజరెడ్డి, అనురాగ్‌రెడ్డి, సిబ్బంది అభిషేక్‌సింగ్, రవిసుధాకర్, ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి పత్రం అందజేత



కమిషనర్ వాణీరెడ్డికి వినతిపత్రం అందజేస్తూ..

కీసర: నాగారం మున్సిపాలిటీలో నాగారం నుంచి ఘట్‌కేసర్ వరకు.. రాంపల్లి నుంచి చర్లపల్లి వరకు ఉన్న రోడ్ల వెడల్పు పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం నాగారం మున్సిపాలిటీ బీఆర్ఎస్ నేత, మాజీ వార్డు సభ్యుడు చెన్నమరాజు సాయినాథ్‌గౌడ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారుల్లో ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున వాహనాల రద్దీ పెరిగిందని, రోడ్డు ప్రమాదాలు కూడా పెరిగాయన్నారు. ఈ రెండు రహదారుల విస్తరణకు నిధులు మంజూరైనట్లు మంత్రి మల్లారెడ్డి స్వయంగా ప్రకటించారని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించే విధంగా చొరవ చూపాలన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న వ్యక్తి అరెస్టు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ఆనంద్‌నగర్‌లో అక్రమంగా ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్న ఓ ఇంటిపై మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఓటీ సీఐ రాములు వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజుశర్మ(25) పెయింటర్‌గా పనిచేసుకుంటూ ఆనంద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను (సుమారు ఆరు అడుగులు) నాటాడు. పక్కా సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుని రాజుశర్మను జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శామీర్‌పేట పెద్దచెరువులో వ్యక్తి గల్లంతు



జునేశ్ కర్జీ (ఫైల్)

శామీర్‌పేట్: శామీర్‌పేట పెద్దచెరువులో పడి వ్యక్తి గల్లంతైన ఘటన సోమవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన జునేశ్ కర్జీ(30)తో పాటు మరో నలుగురు శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో నివాసం ఉంటూ మేస్త్రీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో జునేశ్ కర్జీ కాలు జారీ ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతయ్యాడు. దీంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్గాకు వెళ్లి వస్తున్న వ్యక్తి మృతి



మహ్మద్ మహబూబ్ (ఫైల్)

జవహర్‌నగర్: ఆరోగ్యం బాగాలేదని దర్గా వద్ద నిద్రకు వెళ్లి వస్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాప్రాల్‌లో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. జవహర్‌నగర్ సీఐ సీతారాం వివరాల ప్రకారం.. దమ్మాయిగూడ సాయిబాబానగర్ కాలనీలో నివాసముంటున్న మహ్మద్ మహబూబ్(50) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం సాయంత్రం మహబూబ్ భార్య గౌసియాతో కలిసి నిద్ర చేయడానికి కొకూర్ దర్గా వద్దకు వెళ్లారు. సోమవారం ఉదయం మహబూబ్ లేచి ఇంటికి వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి బాలుడి ఆత్మహత్య



రాహుల్(ఫైల్)

కీసర: పురుగుల మందు తాగి ఓ బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. కీసర గ్రామానికి చెందిన దంపతులు సుధాకర్, సరితల కుమారుడు రాహుల్(16) పదో తరగతి చదివాడు. కొన్ని రోజులుగా ఆందోళనగా ఉంటున్నాడు. ఆదివారం కీసరలోని ఓ షాపులో క్రిమి సంహారక మందు కొనుగోలు చేశాడు. సోమవారం యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం పర్వతాపూర్‌గుట్ట వద్దకు వెళ్లి స్నేహితులకు ఫోన్ చేశాడు. తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పాడు. స్నేహితులు అతడి తల్లిదండ్రులతో అక్కడికి వెళ్లగా అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే ఈసీఐఎల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాలుడి మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బొమ్మలరామారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సంస్థల్లో జాతీయ పతాకానికి వందనం చేయాలి

జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో మంగళవారం ఉదయం జాతీయ పతాకానికి వందనం చేయాలని పేర్కొన్నారు. అనంతరం జరిగే సమావేశాల్లో రాష్ట్రం వచ్చిన తర్వాత విద్యారంగం అభివృద్ధిలో మార్పులు, సాధించిన విజయాలను విద్యార్థులకు వివరించాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జరిగే విద్యా దినోత్సవ వేడుకల్లో మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. మన ఊరు – మనబడి కార్యక్రమం కింద పనులు పూర్తయిన పాఠశాలలో ప్రారంభోత్సవాలు, డిజిటల్ క్లాసులు, లైబ్రరీ కార్నర్ల ప్రారంభోత్సవాలు, రాగిజావా పంపిణీ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న జిల్లా ప్రతినిధులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అత్యధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజిక వర్గానికి న్యాయం జరిగే విధంగా తెలంగాణలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మున్నూరు కాపు సంఘం కలెక్టర్ అమయ్ కుమార్‌ను కోరింది. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారు అందజేశారు. రాష్ట్రంలో 40 లక్షల జనసాంద్రతతో మున్నూరు కాపు పటేల్స్ ఉన్నారని వారు పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తమ సామాజిక వర్గానికి ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. జనాభా ప్రతిపాదికన మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.5 కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బూరుగుపావి హనుమంతరావు పటేల్, మేడ్చల్ మండల అధ్యక్షుడు మండల ఈశ్వరయ్య పటేల్, నాయకులు పడాల రఘురాములు పటేల్, వేణు పటేల్, వీరేష్ పటేల్ పాల్గొన్నారు.

చెరువు శిఖం కబ్జా అవాస్తవం



మాట్లాడుతున్న బెస్త వెంకటేష్, ఇందిరాలక్ష్మీనారాయణ, ధర్మేందర్

కీసర: చీర్యాల గ్రామంలో ప్రజాప్రతినిధులు చెరువులను కబ్జా చేశారంటూ వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ, సర్పంచ్ తుంగధర్మేందర్, ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామంలోని పెద్ద చెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని కొందరు వ్యక్తులు కావాలనే తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రియల్టర్లకు భూమి విక్రయించి పట్టాదారుల్లో కొందరు వ్యక్తులే చెరువు శిఖం కబ్జా అయ్యిందని ఆరోపించడం ఎంత వరకు సమంజసం అన్నారు. చెరువును గతంలోనే ఇరిగేషన్ అధికారులు సర్వే చేసి ఎఫ్‌టీఎల్ హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు కొంతమంది తాము గ్రామాభివృద్ధికి పాటుపడుతుంటే ఓర్వలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకునే విధంగా ముందుకెళ్తామన్నారు. వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ తరగతులు ప్రారంభం

మేడ్చల్‌రూరల్: మండలంలోని గౌడవెల్లి గ్రామంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కుట్టు శిక్షణ తరగతులను సోమవారం గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు బాలచంద్ర ప్రారంభించారు. గ్రామ మహిళలు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని కోరారు.

అధికారులపై కౌన్సిలర్ ఆగ్రహం

పోచారం: మున్సిపాలిటీలోని 3వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారులపై పొంగుతున్న మురుగు, పేరుకుపోయిన చెత్తకుప్పలతో ప్రజలు ఇక్కట్లు పడుతుంటే మున్సిపల్ సిబ్బంది చోద్యం చూస్తోందని ఆరోపించారు. సోమవారం వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కౌన్సిల్ సమావేశంలో పలు సమస్యలపై చర్చ జరిగినా పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

'విమర్శలు సరికాదు'

ఘట్‌కేసర్: నిరాధారమైన ఆరోపణలతో దళితులను అవమానించినట్లు చైర్ పర్సన్ పావని తనపై ఆరోపణలు చేయడం సరికాదని వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి దినోత్సవం రోజు జరిగిన గొడవకు తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తనపై చేసిన ఆరోపణలను ఆధారాలతో నిరూపించకపోతే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు అనురాధ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

శామీర్‌పేట్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మున్సిపాలిటీ స్థాయి మల్లారెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం తూంకుంట మున్సిపాలిటీలోని హకీంపేటలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కారంగుల రాజేశ్వరరావు, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. సర్టిఫికెట్ల జారీకి బ్రేక్



కాప్రా మండలంలో కుప్పలుగా దరఖాస్తులు

జవహర్‌నగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీసీ రుణాలు ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారులు మీ సేవ సెంటర్లలో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించిన తాజా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పెట్టడంతో లబ్ధిదారులు మీ సేవ సెంటర్ల వద్ద బారులుతీరుతున్నారు. కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం లబ్ధిదారులు మీ సేవ సెంటర్లలో దరఖాస్తు చేయడంతో మీ సేవ సర్వర్ డౌన్ ఇయ్యింది. తహసీల్దార్ కార్యాలయంలోని మీ సేవ వెబ్‌సైట్ కూడా పనిచేయడంలేదు. ఈ నెల 9 నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు రావడం, వెబ్‌సైట్ బిజీగా ఉండటంతో మేడ్చల్ జిల్లాలోని దాదాపు అన్ని మండలాల పరిధిలోని తహసీల్దార్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పెండింగ్‌లో పడింది. కాప్రా మండలంలోని కార్యాలయంలో సోమవారం నాటికి కులం సర్టిఫికెట్లు 2,078, ఆదాయం సర్టిఫికెట్లు 4,644 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో అధికారులతో లబ్ధిదారులు ఘర్షణకు దిగుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో రాత్రి వేళల్లో పనులు

పొద్దంతా సర్వర్ డౌన్ ఉండటంతో రెవెన్యూ అధికారులు రాత్రి వేళల్లో లాగిన్ అయి సర్టిఫికెట్లను అప్రూవ్ చేస్తున్నారు. నేటితో (ఈ నెల 20) ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి గడువు కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

బీఆర్ఎస్‌కు బిగ్‌షాక్..

రాజీనామా చేసిన మాజీ సర్పంచ్, పార్టీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు



రాజీనామా లేఖ ప్రదర్శిస్తున్న యాదగిరియాదవ్, సత్తిరెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)కు, పార్టీ సభ్యత్వానికి, మన్నె సత్తిరెడ్డి బీఆర్ఎస్ మున్సిపల్ ఉపాధ్యక్ష పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి మన్నె సత్తిరెడ్డి సోమవారం రాజీనామా ప్రకటించారు. అనంతరం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2007లో ప్రారంభించిన రైల్వే వంతెన పనులు దశాబ్దన్నర కాలంగా కొనసాగుతూనే ఉన్నాయన్నారు. రైల్వే వంతెన నిర్మాణం కోసం మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరామని, మంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడం, వంతెన పనులు ముందుకు సాగకపోవడంతో రాజీనామా చేశామన్నారు. వంతెన కోసం 2022లో నిరాహార దీక్ష చేపట్టినప్పుడు మూడు నెలల్లో పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి మల్లారెడ్డి హామీ ఇచ్చారన్నారు. కానీ నేటికీ వంతెన పనులు ప్రారంభం కాలేదని, భూనిర్వాసితులకు న్యాయం జరగలేదని, పరిహారం చెల్లించలేదని, కనీసం వారితో సమావేశం కూడా నిర్వహించలేదని రాజీనామా లేఖలో ప్రస్తావించారు. అధికార పార్టీలో ఉండటం, స్థానిక ఎమ్మెల్యే మంత్రిగా ఉండి కూడా సాయం చేయకపోవడంతోనే రాజీనామా చేశామన్నారు.